ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం
10 జనవరి
2025





# గుట్ట ఎస్.వీ.ఎన్ లో ముందస్తు సంక్రాంతి సంబురాలు!!

- హరిదాసుల కీర్తనలు
- భోగిమంటల వెచ్చదనంతో తెలుగులో లోగిళ్ళు
- భోగి పండ్లతో అమ్మల ఆరాటం
- కనువిందు చేసిన చిన్నారుల వేషధారణలు
- చిన్నారులకు భోగి పండ్లు పోసిన మాధురి, భాస్కర్ లు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: హరిదాసుల కీర్తనలు... ఆడపడుచుల కోలాహలం... ఆండాలమ్మ ఆలంబన... చిన్నారుల కేరింతలు... భోగి పండ్లతో అమ్మల హడావుడి... భోగి మంటలతో తెలుగు లోగిళ్ళలో సందడికి వేదికగా నిలిచింది ఎస్.వీ.ఎన్ ప్రాంగణం. గురువారం పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ఆయా పాత్రల వేషధారణలతో అలరించారు. ఎటూ చూసినా పండగ సంబరమే కనిపించింది. ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు చేసిన సందడికి పేరెంట్స్ ముచ్చట పడ్డారు. తమ పిల్లలేనా ఇంత సందడి చేస్తున్నదని చూసి మురిసిపోయారు. ఈ వేదికనంతా కనులారా చూసేందుకు వైకుంఠం నుంచి ఎస్.వీ.ఎన్ కు తరలివచ్చిన ఆండాలమ్మ వేషధారణలో భవిష్య అద్భుతంగా నటించింది.

## ఆకట్టుకున్న సంబురాలు

ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ ప్రాంగణం సంక్రాంతి సంబరాలతో ముస్తాబైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం పండుగ పరంపరలను, సంప్రదాయాలను అద్భుతంగా ప్రతిబింబించింది.

## భోగి మంటలతో ప్రారంభం

కార్యక్రమం భోగి మంటలతో ప్రారంభమైంది. పురాతన అలవాట్లను త్యజించి కొత్త ఆరంభాలను ఆహ్వానించాలనే సంకల్పంతో భోగి మంటను విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షోల్లాసాల మధ్య నిర్వహించారు. ఈ సందడితో పాఠశాల ఆవరణ సంతోషకరమైన వాతావరణాన్ని సంతరించుకుంది.

## అద్భుత ప్రదర్శనలు

కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణ విద్యార్థుల డాన్స్ ప్రదర్శనలు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు రంగుల జీవితానికి సంక్రాంతి ఆనందాన్ని చక్కగా ప్రతిబింబించారు. ప్రత్యేకంగా 'సోధి అమ్మ' ప్రదర్శన ప్రతి ఒక్కరినీ అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన పాత్రధారణలు, నృత్యాలు అందరినీ అలరించాయి. 9వ తరగతి విద్యార్థులైన శ్రీజ మరియు శ్రీవర్షిణి లు చేసిన ప్రేరణాత్మక ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి చరిత్ర, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. వారి ప్రసంగాలు పండుగ గొప్పతనాన్ని విశ్లేషిస్తూ, భారతీయ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంచేవిధంగా వారు మాట్లాడారు.

## సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో ఎస్.వీ.ఎన్

**ఎస్.వీ.ఎన్ స్కూల్ కరస్పాండెంట్**

గొట్టిపర్తి భాస్కర్ సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి వివరిస్తూ, సంప్రదాయాలను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పండగ ఆనందాన్ని పంచుకున్నారు. మేనేజింగ్ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ పండగలు మన కాంస్యతను కాపాడటంలో పాత్ర పోషిస్తున్నాయని, విద్యార్థులు తమ జ్ఞానం, సంప్రదాయాలపై గర్వించాలన్నారు.

సంస్కృతి, ఐక్యత ప్రతిబింబం ఈ సంక్రాంతి సంబరాలు విద్యకు సంస్కృతిని మేళవించి పాఠశాల గొప్పదనాన్ని చాటిచెప్పాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సంబరాలు జరుపుకుని పండగ ఆనందాన్ని పంచుకున్నారు.

## గోమాతకు పూజలు

సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా గోమాత నిలిచింది గోమాతకు ప్రత్యేక పూజలు జరిపి చిన్నారులకు గోమాత యొక్క ప్రాధాన్యతను వివరించారు. అదేవిధంగా ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ లు చిన్నారులకు భోగి పండ్లు పోశారు. హరిదాసుల కీర్తనలు సోది చెబుతానమ్మ సోది చెబుతా అంటూ సోదిమ్మల సోది ముచ్చట్లతో ఎస్వీ అను ప్రాంగణం కళ కళ లాడింది. స్టూడెంట్స్ ను ముస్తాబు చేసిన పేరెంట్స్ ను... వేడుకలకు ప్రాణం పోసిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం

























ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జనవరి
2025




# 'ముక్కోటి'కి గుట్ట రెడీ



**గుట్ట గుడిలో ఉ.5:15 నుండి 6:30 గంటల వరకు ఉత్తర ద్వారంలో నరసింహుని దర్శనం**

**నేటి నుండి 15 వరకు అధ్యయనోత్సవాలు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సకల ఏర్పాట్లు జరిగాయి. వైకుంఠ ఏకాదశిని వైభవంగా ఉత్తర ద్వారం ముందు భాగాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారి వైకుంఠ ద్వారదర్శనానికి యాదగిరిగుట్టను అధికారులు రెడీ చేశారు. శుక్రవారం స్వామివారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమివ్వడానికి ఆలయ ఆఫీసర్లు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 5:15 నుండి 6:30 గంటల వరకు దాదాపుగా ఒక గంటా 15 నిమిషాల పాటు స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనమివ్వనున్నారు. ప్రధానాలయ ఉత్తర రాజగోపురం నుండి స్వామివారు వెలుపలకు వచ్చి ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక వేదికపై నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ సమయం భక్తులకు కనువిందు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్తర రాజగోపురం ఎదుట స్పెషల్ బారికేడ్లు, గ్రిల్స్ ను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో ప్రధానాలయం, ఆలయ మాడవీధులు, ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇక పలువురు వీఐపీలు, ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో.. సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంతదూరం నుంచైనా ఉత్తర ద్వారం నుండి స్వామివారు భక్తులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టారు. సాధారణ భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా వీఐపీల కోసం సపరేట్ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. దూరంగా ఉన్న భక్తులకు స్వామివారు స్పష్టంగా కనిపించేలా మూడు ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎలాంటి అవాంఛిత ఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులతో ప్రత్యేక బందోబస్తుకు చర్యలు చేపట్టారు. భక్తులు ఎంతమంది వచ్చినా సరిపోయేలా ప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచారు. ఉదయం 5:15 నుండి 6:30 గంటల వరకు స్వామివారు ఉత్తర ద్వారదర్శనం ఇచ్చిన అనంతరం.. స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు గర్భాలయం నుండి స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇక 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా బ్రేక్ దర్శనాలతో పాటు ఆలయంలో నిత్యం నిర్వహించే స్వామివారి నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, లక్షపుష్పార్చన, ఆర్జిత నిజాభిషేకం, సహస్రనామార్చన కైంకర్యాలను ఒక్కరోజు రద్దు చేశారు.

**నేటి నుండి అధ్యయనోత్సవాలు షురూ...!!**

యాదగిరిగుట్టలో శుక్రవారం ఉదయం వైకుంఠ ఏకాదశి సంబరాలు ముగియగానే.. సాయంత్రం మరో వేడుకకు ఆలయ అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. ఆలయంలో 10 నుండి 15 వరకు ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని ఆరు రోజుల పాటు ఆర్జిత సేవలు తాత్కాలికంగా రద్దు చేశారు. ఆరు రోజుల పాటు ఆలయంలో నిత్యం నిర్వహించే సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు కైంకర్యాలను తాత్కాలికంగా రద్దు చేశారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పలు అవతారాల్లో స్వామివారి అలంకార సేవలు నిర్వహించనున్నారు. 10న ఉదయం లక్ష్మీనరసింహస్వామి అలంకారం, సాయంత్రం మత్స్యాలంకారం.. 11న వేణుగోపాల కృష్ణాలంకారం, గోవర్ధనగిరిధారి అలంకారం.. 12న రామావతారం, వెంకటేశ్వరస్వామి అలంకారం.. 13న వెన్నకృష్ణుడి అలంకారం, కాళీయమర్ధనుడి అలంకారం.. 14న వటపత్రశాయి అలంకారం, వైకుంఠనాథుడి అలంకారం.. 15న ఉదయం నిర్వహించే శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకార సేవతో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

**ఉత్తర ద్వారదర్శనానికి ఏర్పాట్లు పూర్తి - ఈవో భాస్కర్ రావు, యాదగిరిగుట్ట దేవస్థానం**

యాదగిరిగుట్టలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్తర రాజగోపురం వద్ద భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు, గ్రిల్స్ ఏర్పాటు చేశాం. ఉదయం 5:15 నుండి 6:30 వరకు.. ఒక గంట 15 నిమిషాల పాటు స్వామివారు ఉత్తర ద్వారం నుండి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఎంతమంది వీఐపీలు వచ్చినా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాం. శుక్రవారం ఒక్కరోజు బ్రేక్ దర్శనాలు రద్దు చేశాం. రూ.150 టికెట్ పై ఉత్తర ద్వారం గుండా భక్తులకు నిరంతరాయంగా స్వామివారి దర్శనం చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాం. తిరుమల ఘటనను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛిత ఘటనలు తలెత్తకుండా పోలీసులతో ప్రత్యేక బందోబస్తు, పటిష్టమైన భద్రత కల్పించనున్నాం.

# లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్స్ లో మకర సంక్రాంతి సంబరాలు





దిల్ సుక్ నగర్, రోమింగ్ న్యూస్: లోటస్ గోల్డ్ స్కూల్, దిల్షుఖ్ నగర్ బ్రాంచ్, ఎంతో ఆనందంతో మకర సంక్రాంతి సంబరాలు జరిపింది. 1నుండి 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంతో పతంగుల తయారీ మరియు మట్టి కుండల తయారీ వంటి కార్యాక్రమాల లో పాల్గొన్నారు. 206 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. వారి రంగుల ఒడిబిడ్డలతో చేసిన ఆవిష్కరణలు పండుగ ఆత్మను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిగత మరియు విద్యా ప్రయాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఈ క్రాఫ్టింగ్ చర్యలు సృజనాత్మకత, ఓర్పు మరియు సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయి.

**కార్యక్రమపు ముఖ్యాంశాలు:**

1. సాంస్కృతిక సంబంధం

గాలి పతంగుల తయారీ మరియు మట్టి కుండల తయారీ మన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ వారసత్వాన్ని గుర్తించుకుని, పండుగల విశిష్టతను అర్థం చేసుకోవచ్చు.

2. సృజనాత్మకత మరియు ఆవిష్కరణ

ఈ చర్యలు విద్యార్థుల ఊహాశక్తి మరియు ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంచుతాయి. మట్టి కుండల తయారీలో రూపకల్పన, ఆకారాలు చేయడంబీ గాలి పటంగులలో డిజైన్, రంగుల వినియోగం చేయడం విద్యార్థులను నూతన ఆలోచనలకు ప్రోత్సహిస్తాయి.

3. మోటార్ నైపుణ్యాలు మరియు దృష్టి

కుండలు మరియు పటంగులు తయారుచేయడం చిన్నచిన్న విషయాలకు దృష్టి పెట్టడం, చేతులూ-కళ్ళ సమన్వయం వంటి నైపుణ్యాలను పెంచుతుంది.

4. జట్టుగా పని చేసే నైపుణ్యం

ఇలాంటి కార్యకలాపాల ద్వారా విద్యార్థులు సహకారం, ఆలోచనల పంచుకోవడం వంటి గుణాలు నేర్చుకున్నారు.

5. సమస్యల పరిష్కారం మరియు సహనశీలత

కుండకు సరైన ఆకారం ఇవ్వడం, గాలి పటంగులు ఎగరడం వంటి సమస్యలను ఎదుర్కోవడం విద్యార్థులను సమస్యల పరిష్కారంలో దిట్టగా మారుస్తుంది.

6. ఆనందం మరియు తృప్తి

తమ చేతులతో రూపొందించిన వస్తువుల పట్ల విద్యార్థులకు సంతృప్తి కలుగుతుంది. ఇది వారి ఆత్మవిశ్వాసం మరియు ప్రేరణను పెంచుతుంది.

ఈ కార్యక్రమానికి ప్రియతమ ఛైర్పర్సన్, విద్యారత్న లయన్ డాక్టర్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి గారు హాజరై, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన విద్యార్థులను ప్రశంసిస్తూ, వారు ఎంతో తెలివైన మరియు మేధావులని కొనియాడారు. ఈ వేడుక ద్వారా విద్యార్థులు సంక్రాంతి సంబరాల సాంస్కృతిక ప్రాముఖ్యత తెలుసుకుని, కలిసికట్టుగా పని చేయడం, సహకారం, మరియు ఆత్మవిశ్వాసం వంటి విలువలను గడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థుల కృషి మరియు సృజనాత్మకతను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము.




# సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**విధులకు హాజరుకాని బొమ్మలరామారం మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంపీహెచ్ఎస్ కు షోకాజ్ నోటీసులు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: విధుల్లో సమయపాలన పాటించకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. గురువారం బొమ్మలరామార మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సమాచారం లేకుండా విధులకు హాజరుకాని మండల మెడికల్ ఆఫీసర్ శ్రీహర్ష, ల్యాబ్ టెక్నీషియన్ మమత, ఎంపీహెచ్ఎస్ సుమతికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ల పట్ల డాక్టర్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పీహెచ్సీలో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్న ఆయన.. హాస్పిటల్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని పీహెచ్సీ సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు హాస్పిటల్ కు వచ్చిన కలెక్టర్.. పీహెచ్సీ అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి, ఎంతమంది సిబ్బంది విధులకు వచ్చారు.? ఎంతమంది డుమ్మా కొట్టారో ఆరా తీశారు. ల్యాబ్, ఓపీ రిజిస్టర్ ను చెక్ చేసి రోజుకు ఎంతమంది పేషెంట్లు పీహెచ్సీకి వస్తున్నారో తెలుసుకున్నారు. హాస్పిటల్ లో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి.? డెలివరీ కోసం గర్భిణీలు ప్రైవేట్ హాస్పిటల్లకు ఎందుకు వెళ్తున్నారో పేషెంట్లకు స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుమలత, పీహెచ్సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



**బొమ్మలరామారం తహశీల్దార్ ఆఫీస్ లో కలెక్టర్ తనిఖీలు**

బొమ్మలరామారం తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీలో అలసత్వం వహించొద్దని, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలను గ్రౌండ్ లెవల్ లో పరిశీలించిన కలెక్టర్.. అన్ని మాడ్యూల్స్ లో దాఖలైన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. సక్సేషన్, మ్యుటేషన్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. విధుల్లో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు



**నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా తిరుప్పావై పాశురాలలో "ఒరుత్తి మగనాయి పిరందు"! విశేష పాశురం ( ధధి మధనం,వెన్న ప్రసాద సమర్పణ) గురువారం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండా.వెంకటయ్య, అరుణమ్మ,తిరుప్పావై ఆచార్యులు కైరంకొండ.వెంకటేశ్వర్లు, గున్నాల.లక్ష్మి, ఆజాద్, మాజీ చైర్మన్ భోనగిరి వెంకటేశ్వర్లు,ఆలయ అర్చకులు లక్ష్మి నరసింహ చార్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు ముక్కోటి ఏకాదశి, కుడరై, పరంపర,శ్రీ రంగ గోధా కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా చేసారు

## బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ గా చనగాని రాములు



నకిరేకల్ : భారతీయ జనతా పార్టీ నకిరేకల్ మండల తాటికల్ గ్రామానికి చెందిన చనగాని రాములుని జిల్లా కౌన్సిల్ మెంబర్ గా నియమించారు బిజెపి పార్టీ పటిష్టత కోసం సేవలందించిన ఆయనను గుర్తించి జిల్లా కౌన్సిల్ మెంబర్ గా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం జిల్లా నియోజకవర్గ మండల నాయకత్వం సూచనలు సలహాల మేరకు తన వంతుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజలకు మేలు కలిగే విధంగా జరిగే కార్యక్రమాలు చేపడతామన్నారు తన నియమానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు నాగం వర్షత్ రెడ్డి కి, జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న కి,మాజీ మండల అధ్యక్షులు యానాల శ్రీనివాసరెడ్డి కి ,జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గునుగుంట్ల సాయన్న కి ,నూతన అధ్యక్షులు బూడిగే సైదులు కి ,ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి బండమీది శ్రీకాంత్ కి జిల్లా నాయకులకు ,మండల నాయకులకు ,బూత్ అధ్యక్షులకు ,కార్యకర్తలకు రాములు ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

